బీసీ హక్కుల కోసం ఏకం కండి

అసిపె పుస్తకావిష్కరణ సభలో జూలూరు గౌరీ శంకర్

అసిపె పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీ శంకర్, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న

రవీంద్రభారతి,డిసెంబర్ 3: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను యథావిధిగా అమలు జరుపు జరపాలని, ఎంబీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీశంకర్ డిమాండ్ చేశారు. బీసీలను సంపన్నులను చేస్తామని వేలాది కోట్ల రూపాయలు కేటాయిస్తామని చెప్పిన మాటను తూచ తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బహుజన ఉద్యమంలో భాగంగా బీసీ కవులు రచయితలు, కళాకారులు ఏకమై నిలవాల్సిన తరుణం ఆసన్నమైనదన్నారు. అన్ని ప్రగతిశీల ఉద్యమాలలో పాల్పంచుకున్న బీసీ కవులు, రచయితలు బహుజన రాజ్యాధికార లక్ష్యంగా రచనలు చేయాలని కోరారు. సంపదలు, అధికారాల్లో బీసీలు తమ వాటా ప్రకారం, తమకు రావాల్సిన కోటాలపై సంగ్రామం జరుగుతున్న సందర్భంలో బీసీ ఉద్యమానికి భావజాల ఆయుధాలు అందించే మహత్సర చారిత్రక బాధ్యతలను బీసీ కవులు, రచయితలు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. బీసీలను కవిత్వ ద్వారా చైతన్యం చేసే బాధ్యతను వనపట్ల సుబ్బయ్య తన 'అసిపె' దీర్ఘ కవితలో స్పష్టంగా విశ్లేషించారని జూలూరు పేర్కొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, నెల పొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలోని సమావేశం మందిరంలో రచయిత వనపట్ల సుబ్బయ్య రచించిన 'అసిపె' పుస్తకావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు, పూర్వ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్నలు విచ్చేసి అసిపె పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోరెటి వెంకన్న మాట్లాడుతూ, కులం, మతం పేరిట సమాజాన్ని ధ్వంసం చేస్తుంటే కవి మౌనంగా ఉండరని పేర్కొన్నారు. కవిత్వం రాయడం మొదలుపెడితే ఆది జ్ఞాన జ్యోతియై వెలుగుతుందన్నారు. రచయిత వనపట్ల సుబ్బయ్య ప్రతిభా సంపన్నుడని, గొప్ప కళాకారుడని ఉప సంస్కృతి అసిపె పుస్తకంలో ఇమిడి ఉన్నదని ప్రశంసించారు. ఈ పుస్తకం చదివితే మంచి పరివర్తన వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కవి యాకూబ్, కోట్ల వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

బీవోబీ ఆధ్వర్యంలో బరోడా కిసాన్ పక్వాడా

సిటీబ్యూరో, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో ఏడో ఎడిషన్ బరోడా కిసాన్ పక్వాడా కార్యక్రమాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లుగా బీవోబీ వర్గాలు వెల్లడించాయి. రైతులను సాంకేతిక బ్యాంకింగ్ సేవలను అందించడమే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి పెట్టినట్లుగా ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పక్వాడా కార్యక్రమంలో భాగంగా 3700 మంది రైతులకు లోన్లను అందజేయగా, డిజిటల్ బరోడా కిసాన్ క్రెడిట్ కార్డు, డిజిటల్ గోల్డ్ లోన్లు అందజేయనున్నట్లుగా పేర్కొన్నారు. హైదరాబాద్ జోనల్ హెడ్ రితేశ్ కుమార్ మ్లాడుతూ, రైతులకు ఆర్థిక పరిపక్వత కల్పించడంలో బీవోబీ ముందు వరుసలో ఉంటుందన్నారు. వినూత్న విధానంలో బ్యాంకింగ్ సేవలను అందిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ జోన్ పరిధిలో 434 బ్రాంచులలో బీవోబీ బ్యాంకింగ్ సేవలు నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా కిసాన్ క్రెడిట్ కార్డులు, గోల్డ్ లోన్లు, ట్రాక్టర్ లోన్లు, స్వయం సహాయక గ్రూపులకు నిధుల మంజూరు చేస్తున్నట్లుగా తెలిపారు. ఏడాది కాలంలోనే బ్యాంకింగ్ సేవలతో వృద్ధి సాధించామన్నారు.

స్వామి చాట్‌బాట్ ప్రారంభం

సిటీబ్యూరో, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): శబరిమల ఆలయానికి యాత్రా అనుభవాన్ని మెరుగుపరచడానికి కేరళలోని పతనంతిట్ట జిల్లా పరిపాలన విభాగం, ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ ముత్తూట్ ఫైనాన్స్ సహకారంతో స్వామి చాట్‌బాట్‌గా పిలువబడే డిజిటల్ అసిస్టెంట్‌ను ప్రారంభించింది. దీనిని కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్ ప్రారంభించారు. కార్యక్రమంలో దేవ స్వోమ్, ప్రత్యేక కార్యదర్శి అనుపమ, పతనం తిట్ట కలెక్టర్ ప్రేమ కృష్ణన్ పాల్గొన్నారు.

సర్కారు దవాఖానల్లో సమస్యల తిష్ట

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అల్లాపూర్, డిసెంబర్ 3: ప్రభుత్వ ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాలతో పాటు, బస్తీ దవాఖానల్లో సమస్యలు తిష్టి వేశాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ ప్రభుత్వ దవాఖానను స్థానిక కార్పొరేటర్ సబీహా బేగంతో ఎమ్మెల్యే కృష్ణారావు కలిసి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో తరుచు మందుల కొరత, ప్రధానంగా రాత్రి వేళల్లో వైద్య సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఎమ్మెల్యేకు వివరించారు. మందుల కొరతపై ఆస్పత్రి డ్యూటీ డాక్టర్‌ను ఎమ్మెల్యే నిలదీయగా, పై నుంచే మందులు సరఫరా కావడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మహా నగరంలో 150 బస్తీ దవాఖానలు అందుబాటులోకి తీసుకువచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక, గత ఏడాదిగా బస్తీ దవాఖానల నిర్వహణ గాలికి ఒదిలేశారని మండిపడ్డారు. బస్తీ దవాఖానలో బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసేందుకు కనీస వైద్య పరికరాలు కూడా లేని దయనీయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు, వైద్యారోగ్య శాఖ మంత్రికి ప్రజల సమస్యలు పట్టవా? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇప్పటికైనా వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ దవాఖానల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, జహెద్ షరీఫ్ బాబా, నాగుల సత్యం, వీరారెడ్డి, బొల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పర్వత్‌నగర్ ప్రభుత్వ దవాఖాన ఆవరణలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

టీ -వర్క్స్‌లో స్టార్టప్ ఆక్సిలరేటర్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న తెలంగాణ ఎమర్జింగ్ టెక్నాలజీ డైరెక్టర్ రమాదేవి, టీ -వర్క్స్ సీఈఓ జోగేందర్‌లు

దివ్యాంగుల అవసరాలకు తగిన పరికరాలు రావాలి

కొండాపూర్, డిసెంబర్ 3: దివ్యాంగులు నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉపయోగపడే ఆవిష్కరణలపై దృష్టి సారించాలని తెలంగాణ ఎమర్జింగ్ టెక్నాలజీ డైరెక్టర్ రమాదేవి లంక అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నాలెడ్జ్ సిటీలోని టీ-వర్క్స్‌లో స్టార్టప్ కంపెనీల ఆక్సిలరేటర్ ప్రోగ్రామ్‌ను ఆమె టీ-వర్క్స్ సీఈఓ జోగేందర్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివ్యాంగుల కోసం సరికొత్త పరికరాలు, సాఫ్ట్‌వేర్‌లను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనికోసం స్టార్టప్ కంపెనీలు, ఈ రంగంలో ఉన్న కంపెనీలు ముందుకు రావాలన్నారు. పారా ఒలంపిక్స్‌లో కూడా దివ్యాంగులు పతకాలు సాధించి మన దేశానికి గర్వంగా నిలిచిన విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలు సంస్థల ప్రతినిధులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ నెల 21వ తేదీ వరకు స్టార్టప్ కంపెనీల ఆక్సిలరేటర్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంచిన ఘనత బీఆర్ఎస్‌దే..

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హెచ్‌బీ కాలనీలో ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం

హాజరైన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, స్థానిక నేతలు

కాప్రా, డిసెంబర్ 3: దివ్యాంగులకు పెన్షన్ పెంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. హెచ్‌బీ కాలనీ ఫస్ట్‌ఫేజ్ మైదానంలో కాప్రా పట్టణ వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ప్రపంచ వికలాంగుల దినోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు జే.ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగులకు ఆత్మ విశ్వాసం మెండుగా ఉంటుందని, ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించిన చరిత్ర వారికి ఉందన్నారు. కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం దివ్యాంగులు ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని, వారికి పెన్షన్‌ను రూ.4,016 చేసి వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రభుత్వ పథకాల్లో వారికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా కాప్రా వికలాంగుల సమాఖ్య అందిస్తున్న రెండు ట్రైసైకిల్స్, రెండు వీల్ చెయిర్స్, రెండు ట్రైపాడ్స్, 200 మందికి దుప్పట్లు, వికలాంగుల కోసం బ్యాంకు నుంచి రూ.12 లక్షల రుణాలను మూడు గ్రూపులకు అందజేశారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, ప్రాజెక్టు అధికారి దామోదర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, కాప్రా వికలాంగుల సమాఖ్య అధ్యక్షులు ఎండీ బాబా జానీ, ఉపాధ్యక్షులు లక్ష్మీ, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఆంజనేయులు, పాండు నాయక్, నరసింహ, కమిటీ సభ్యులు మల్లారెడ్డి, సుజాత, నాగరాణి, మనీషా, పట్టణ వికలాంగుల సమాఖ్య సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వికలాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు జె.ప్రభుదాస్, పి.దేవేందర్ రెడ్డి, డీసీ జగన్ తదితరులు

పార్క్‌లో కంటైనర్‌ను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

బడంగ్‌పేటలో హైడ్రా కూల్చివేతలు

సిటీబ్యూరో, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): ఓఆర్ఆర్ లోపల హైడ్రా కూల్చివేతల పర్వం కొనసాగుతోంది. హైదరాబాద్‌లోని మహేశ్వరం నియోజకవర్గంలో హైడ్రా అధికారులు మంగళవారం కూల్చివేతలు చేపట్టారు. బడంగ్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని అల్మాస్‌గూడ గ్రామం శ్రీవెంకటేశ్వర కాలనీలోని కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు పార్క్ స్థలంలో ఏర్పాటు చేసిన రెడీమేడ్ కంటైనర్‌ను హైడ్రా అధికారులు తొలగించారు. హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేశ్ ఆధ్వర్యంలో మున్సిపల్, హైడ్రా సిబ్బంది ఈ కూల్చివేతల్లో పాల్గొన్నారు. ఫిర్యాదు ఇచ్చిన రెండురోజుల్లోనే హైడ్రా కూల్చివేతలు చేపట్టిందని కాలనీ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

మా వృత్తిని మేమే చేసుకునేలా జీవోలు రావాలి

తెలంగాణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రమేశ్ నాయి

చిక్కడపల్లి, డిసెంబర్ 3: మా వృత్తిని మేమే చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో చేసి అమలు చేయాలని తెలంగాణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రమేశ్ నాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయి బ్రాహ్మణ కుల వృత్తి కాపాడుకోవటం కోసం జీవో సాధనకై ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధక్షుడు రమేశ్ నాయి మాట్లాడుతూ, లక్షలాది మంది తమ వృత్తి చేసుకుంటూ జీవనాధారం పొందుతున్నారని తెలిపారు. కార్పొరేట్ సంస్థలు సెలూన్స్ ఏర్పాటు చేయడంతో నాయి బ్రాహ్మణులకు జీవనాధారం లేకుండా పోతుందని, మా వృత్తి మాకే కాకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా గత ప్రభుత్వం అందించిన విధంగా ఈ ప్రభుత్వం కూడా నాయి బ్రాహ్మణుల సెలూన్లకు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సెలూన్లు పూర్తి స్థాయిలో నిర్మూలించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం, చట్ట సభల్లో అవకాశాలు కల్పించాలన్నారు. సంఘం నాయకులు నరసింహ నాయి, వెంకటేశ్, శేఖర్, ధర్మయ్య, యాదయ్య, యాదగిరి, రమేశ్, దత్తు నాయి పాల్గొన్నారు.

ధర్నాలో తెలంగాణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రమేశ్ నాయి, నాయకులు

జూట్ బ్యాగుల తయారీలో శిక్షణ

మేడ్చల్, డిసెంబరు 3: రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని గ్రామీణ నిరుద్యోగ యువకులు స్వయం శక్తితో వ్యాపార, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు స్వర్ణ భారత్ ట్రస్టులోని యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో జూట్ బ్యాగుల తయారీపై ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 19 నుంచి 45 ఏండ్లలోపు ఉన్న, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు ప్రతులతో పాటు మూడు ఫొటోలు వెంట తీసుకురావాలన్నారు. అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పించనున్నారు. వివరాలకు ఫోన్ నం. 93914 87797, 91771 41712, 96185 34720, 63018 90681, 94417 28468లలో సంప్రదించవచ్చన్నారు.

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శ్రీకాంతాచారికి ఘన నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 3: తెలంగాణ మలి దశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతిని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొనుపునూరి శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, శ్రీకాంతాచారి త్యాగం మరవలేనిదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు వెంకటేశ్, శివ, రవికిరణ్, కుమార్ పాల్గొన్నారు.

శ్రీకాంతాచారికి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

గురుకులంలో కలెక్టర్ తనిఖీ

కంటోన్మెంట్ నియోజకవర్గం వెస్ట్ మారేడ్‌పల్లిలో ఎస్సీ బాలికల గురుకులాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేసి, అక్కడి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పిల్లల ఆరోగ్యం బాగుండాలని 40% డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేశ్ పాల్గొన్నారు.- *సిటీబ్యూరో, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ);*

జూబ్లీహిల్స్‌లోని అంబేద్కర్ వర్సిటీలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

అంబేద్కర్ వర్సిటీ స్థలం.. వేరే యూనివర్సిటీకి దారుణం

అంబేద్కర్ వర్సిటీ జేఏసీ నేతలు

బంజారాహిల్స్, డిసెంబర్ 3: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆవరణలోని 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం దారుణమని యూనివర్సిటీ ఉద్యోగుల జేఏసీ పేర్కొంది. ఉద్యోగులు చేపట్టిన నిరసనలో భాగంగా మంగళవారం జేఏసీ కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి డా.రాజాగౌడ్ మాట్లాడారు. అంబేద్కర్ వర్సిటీలో అందించే బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. యూనివర్సిటీ అందిస్తున్న లైబ్రరీ కోర్సులకు దేశ వ్యాప్తంగా మంచి ఆదరణ ఉందని యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో అత్యధికంగా ఈ కోర్సుల్లోనే అడ్మిషన్లు ఎక్కువగా పొందారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ వర్సిటీకి చెందిన విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని గుర్తుచేశారు. ఇలాంటి తరుణంలో యూనివర్సిటీలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సింది పోయి యూనివర్సిటీ స్థలాన్ని వేరే సంస్థలకు కేటాయించడం దారుణమని ఆరోపించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్ పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణను విమర్శిస్తే తీవ్ర పరిణామాలు: ఎంఎస్ఎఫ్

సమావేశం అనంతరం నినదిస్తున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 3: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను వ్యక్తిగతంగా విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్, జాతీయ కార్యదర్శి పల్లెర్ల సుధాకర్ హెచ్చరించారు. 30 ఏండ్లుగా అలుపెరగని పోరాటం చేసి సామాజిక న్యాయమైన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సాధించిన యోధుడు మంద కృష్ణ మాదిగ అని అన్నారు. ఆయనను వర్గీకరణను వ్యతిరేకించే స్వార్థపరులైన కొందరు మాల మనువాదులు రిజర్వేషన్ల దోపిడీకి మరిగి 58 కులాల వాటాను ఒక్క కులమే గత 30 ఏళ్లుగా అనుభవిస్తోందని మండిపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎంఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు, సుప్రీం కోర్టు రాజ్యాంగ విస్తృత ధర్మాసనం, ముఖ్యమంత్రులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా, కుల, విద్యార్థి సంఘాలు, ప్రజాస్వామ్యవాదులంతా వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారని చెప్పారు. ఈ విషయం తెలిసి, స్వార్థబుద్ధితో వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి కోసం పరేడ్ గ్రౌండ్‌లో మాలల సింహగర్జన సభను నిర్వహించారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు మంద రాజు, దుప్పెల్లి అనిల్, సామ్రాట్ అజయ్, విజయ్, కోల హరీశ్, కూర్పటి ఆంజనేయులు, కనకపూడి మహేందర్, రమేశ్, ప్రణయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మాలల మీద మంద కృష్ణ విషం చిమ్మడం మానుకోవాలి

మండిపడిన మాల సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 3: మాలల సింహగర్జన సభ విజయవంతం కావడాన్ని జీర్ణించుకోలేక మాలలపై మంద కృష్ణ మాదిగ విషం చిమ్ముతున్నాడని వివిధ మాల సంఘాల నాయకులు ఆరోపించారు. ఇప్పటికైనా మాలల మీద విషయం చిమ్మడం మానుకోవాలని సూచించారు. మాలల పట్ల మంద కృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్ మిషన్ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మందాల భాస్కర్, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల లింగస్వామి మాట్లాడుతూ, మంద కృష్ణ ఉపయోగించే భాష మాలలను రెచ్చగొట్టే విధంగా ఉందని మండిపడ్డారు. ఉద్యమం పేరుతో వివిధ రాజకీయ పార్టీలతో, దళిత వ్యతిరేక నాయకులతో కుమ్మక్కై, సాటి మాలల మీద విషం చిమ్ముతూ దళితుల ఐక్యతను దెబ్బ తీస్తున్నాడని దుయ్యబట్టారు. స్వార్థ ప్రయోజనాల కోసం మంద కృష్ణ మాదిగ జాతికి చేస్తున్న ద్రోహం క్షమించరానిదని అన్నారు. మాల జాతి, రాజకీయ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమన్నారు. కార్యక్రమంలో అంసా ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, తెలంగాణ మాల విద్యార్థి జేఏసీ నాయకులు వీరస్వామి, మాదాసు రాహుల్, పండుగ భాను తేజ, గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నినదిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మెట్రో భవన్‌లో వైద్య శిబిరం

పాల్గొన్న ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సిటీబ్యూరో, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): బేగంపేట్‌లోని మెట్రో రైల్ భవన్‌లో వైద్య శిబిరాన్ని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. తెలంగాణ ప్రజాపాలన ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైలు ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. కిమ్స్-సన్‌షైన్ సహకారంతో హెచ్ఎంఆర్ఎల్ నిర్వహించగా, మెట్రో రైలు సంస్థ అధికారులు, సిబ్బందికి పాల్గొని వైద్య సేవలు పొందారు. పలువురు ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకోగా, దంత పరీక్షలు, కంటి పరీక్షలు, సాధారణ వైద్య పరీక్షలను వైద్యులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎంఆర్ఎల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

తూంకుంట మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న తూంకుంట మెయిన్ రోడ్డు బిల్డింగ్స్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు

120 ఫీట్లు తగ్గించి భూ సేకరణ చేయండి

- తూంకుంటలో పర్యటించిన జిల్లా భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
- మున్సిపల్ కార్యాలయం ముందు బాధితుల ఆందోళన

శామీర్‌పేట, డిసెంబర్ 3: రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణ పనుల్లో 120 ఫీట్లు తగ్గించి భూ సేకరణ నిర్వహించాలని రోడ్డు విస్తరణ ఇండ్లు, షాపులు కోల్పోతున్న బాధితులు (తూంకుంట మెయిన్ రోడ్డు బిల్డింగ్స్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ) జిల్లా భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శంకర్ కుమార్‌ను కోరారు. బాధితుల వినతి మేరకు మంగళవారం శంకర్ కుమార్ హకీంపేట, పొత్తాయిపల్లి, తూంకుంట ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో సమస్యను అడిగి తెలుసుకున్నారు. 200 ఫీట్ల మేరకు రోడ్డు విస్తరణ పనుల కోసం అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో బాధితులు 200 ఫీట్లు కాకుండా 120కి తగ్గించి రోడ్డు విస్తరణ చేపట్టాలని, కోల్పోయిన స్థలాలకు పరిహారంతో పాటు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వానికి నిరసనగా మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో తూంకుంట మెయిన్ రోడ్డు బిల్డింగ్స్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు విద్యాసాగర్, మల్లేశ్ గౌడ్, రాజులు గౌడ్, సోనారామ్, విక్రమ్ గౌడ్, ఆంజనేయులు, నాగేందర్, మధు, శ్రీనివాస్ గౌడ్, సుభాష్ గౌడ్ పాల్గొన్నారు.